క్లుప్తంగా

శ్రీవారి సన్నిధిలో ఆకేపాటి



కుటుంబ సభ్యులతో కలసి శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

రాజంపేట : కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి శుక్రవారం దర్శనం చేసుకున్నారు. కుటుంబ సమేతంగా ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీవారిని వైకుంఠ ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నట్లు ఆకేపాటి తెలిపారు. జిల్లా ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వామివారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజంపేట టౌన్ : సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, 33/11 కేవీ విద్యుత్ లైన్లకు సమీపంలో ఉండే చెట్లను తొలగించే కార్యక్రమాలు చేపట్టనున్న కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఆపరేషన్ డీఈఈ ఎం.సురేంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజంపేట పట్టణంతోపాటు ఆకేపాడు, కట్టకిందపల్లె, హెచ్.చెర్లోపల్లె, తాళ్లపాక సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

కాలభైరవుడికి పూజలు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె సమీపంలోని గుట్టపై వెలసిన కాల భైరవుడికి ముక్కోటి ఏకాదశి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. శుక్రవారం స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి అందంగా అలంకరించి భక్తుల దర్శన ఏర్పాటు చేశారు. స్వామి వారిని స్థానికులతోపాటు స్థానికేతరులు దర్శించుకున్నారు.

సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

రైల్వేకోడూరు అర్బన్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పట్టణంలోని డాల్ఫిన్ డేల్ హైస్కూల్‌లో కరస్పాండెంట్ పంజం సుకుమార్‌రెడ్డి ముందస్తు సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో మెరిశారు. పలువురు విద్యార్థులు ప్రత్యేక వేషధారణల్లో కనువిందు చేశారు. తెలుగు సంప్రదాయంలో సంక్రాంతి పండుగకు ఎంతో విశిష్టత ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బిట్స్ కళాశాలలో..

రామాపురం : మండలంలోని బండపల్లె పంచాయితీ బిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను కళాశాల యజమాని మన్నూరు భాస్కర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు భోగి మంటలు వేసి సందడి చేశారు. కోలాటం, చెక్కభజన, సాంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి.

జూద క్రీడలు నిర్వహిస్తే చర్యలు



ఎస్‌ఐ శ్రీనివాసులు

సుండుపల్లె : మండల పరిధిలో సంక్రాంతి పండగ సందర్భంగా కోడి పందేలు, పేకాట, చెక్కా బొమ్మతోపాటు ఇతర జూద క్రీడలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. కోడి పందేల నిర్వహణకు స్థలాలు ఇచ్చినా, నిర్వహించినా కేసులు పెడతామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొన్న, ప్రోత్సహించిన ఉపేక్షించబోమన్నారు. మండల పరిధిలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

చదువే కాదు క్రీడలూ ప్రధానమే



విజేతలను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

రాయచోటి టౌన్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనిచ్చి రాణించాలని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆ కళాశాల మైదానంలో నెహ్రూ యువ కేంద్రం, వీఆర్‌డీఎస్ సంస్థ వ్యవస్థాపకుడు సురేంద్రారెడ్డిల ఆధ్వర్యంలో విద్యార్థులకు నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మొత్తం 10 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలూ ప్రధానమేనన్నారు. అనంతరం గెలిచిన ప్రథమ, ద్వితీయ బహుమతులతోపాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రథమ బహుమతిని రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సాధించగా, ద్వితీయ బహుమతిని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సాధించారు.

మల్చింగ్ సాగు.. లాభాలు బాగు

- కలుపు నివారించవచ్చు
- వేరు వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది
- మల్చింగ్‌కు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తే ప్రయోజనకరం



దోస, బొప్పాయి పంటలకు అమర్చిన మల్చింగ్ షీట్

జిల్లాలో మల్చింగ్ షీట్‌పై పండించే పంటలు (ఎకరాలు)

నియోజకవర్గం	దోస	బొప్పాయి	కర్బూజ	అరటి	టమాటా
కోడూరు	2210	3109	1720	3516	-
రాయచోటి	480	2030	346	58	-
రాజంపేట	179	445	225	1467	-
మదనపల్లె	125	109	56	14	3240
పీలేరు	230	429	42	28	4117
తంబళ్లపల్లి	708	380	-	-	9044

రైల్వేకోడూరు అర్బన్ : రైతులు పంట సాగు చేసిన ప్రతి సారి అతివృష్టి, అనావృష్టి కారణంగా నష్టపోతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు బొప్పాయి, అరటి, కూరగాయలు, దోస, కర్బూజ, మిరప, పూలసాగు తదితర పంటలను మల్చింగ్ షీట్ పద్ధతిలో పండించి బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ విధానంలో డ్రిప్ నీటి పారుదల ఉండడం వల్ల ఎక్కువ వర్షాలు వచ్చినా, తక్కువ వర్షాలు వచ్చినా మొక్కల పెరుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. కొంతమంది రైతులు మల్చింగ్ విధానంపై ఆసక్తి చూపుతున్నారు. ఇలాంటి రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తే వారు మంచి దిగుబడులు, అధిక రాబడి పొందుతారు.

మల్చింగ్ వల్ల కలిగే ప్రయోజనాలు..

చిన్న పంటలను కూడా మల్చింగ్ ద్వారా పండిస్తే వర్షాభావ పరిస్థితులలో నీటిని ఆదా చేసుకోవచ్చు. మల్చింగ్ కింద డ్రిప్ పైపు ఉండడం వల్ల మొక్కకు నీరు సమృద్ధిగా అందుతుంది. చెట్టుకింద భూమి పొడిగా ఉండి వేరు వ్యవస్థ ఆరోగ్యంగా పెరుగుతుంది. కలుపును నివారించవచ్చు. డ్రిప్ ద్వారా వేసిన ఎరువులు మొక్కలకు బాగా అందుతాయి. మల్చింగ్ షీట్‌పై పంటలు పండిస్తే భారీ వర్షాలు పడినా తెగుళ్లు తక్కువగా వస్తాయి. పంట నాణ్యతతో పాటు దిగుబడి పెరుగుతుంది.

కొత్త ప్రభుత్వంలో సబ్సిడీలకు మంగళం..

ప్రస్తుత ప్రభుత్వం రైతులకు అందించే సబ్సిడీలకు నిధులు కేటాయించకుండా.. పథకాలకు మంగళం పాడడడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సీజన్‌లో రైతులు ఎక్కువగా దోస, కర్బూజ, బొప్పాయి, అరటి పంటలను మల్చింగ్ షీట్లపై పండించేందుకు ఆసక్తి చూపుతారు. అయితే ప్రభుత్వ సబ్సిడీలు రైతులకు అందుబాటులో లేవు. జిల్లాలోని 6 నియోజకవర్గాల్లో రైతులు ఎక్కువ శాతం దోస, కర్బూజ పంటలు మల్చింగ్ షీట్‌పై వేసి బొప్పాయి, అరటి కూడా సాగు చేస్తారు. ఇలా జిల్లాలో వేలాది ఎకరాలలో రైతులు పంటలు పండిస్తుంటారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల రైతులకు అన్ని రకాల సబ్సిడీలు అందించేవారు. అందులో భాగంగానే మల్చింగ్ షీట్‌కు కూడా రైతులకు సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహించారు. కానీ ఇప్పటి కూటమి ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సిన సబ్సిడీల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

కలుపు నివారణ కోసమే



గత కొంత కాలంగా మల్చింగ్ షీట్ ద్వారా దోస, కర్బూజతో పాటు అరటి, బొప్పాయి పంటలు పండిస్తున్నాము. ఈ ఏడాది దోసతో పాటు రెండవ పంటగా బొప్పాయి వేశాను. మల్చింగ్ షీట్ వల్ల ముఖ్యంగా కలుపు బెడద ఉండదు. దీనివల్ల కూలీల భారం తగ్గుతుంది. పెట్టుబడి తగ్గుతుంది.

– ప్రతాప్‌రెడ్డి, ఆదర్శ రైతు, ఓ. కొత్తపల్లి, రైల్వేకోడూరు

పంట దిగుబడి బాగా వస్తుంది



గత కొంత కాలంగా మల్చింగ్ షీట్ ద్వారా టమాటా ఎకరా పొలంలో పండిస్తున్నాను. రెండు పంటలకు మల్చింగ్ షీట్ వల్ల ఉపయోగం ఉంది. ముఖ్యంగా తెగుళ్ల బెడద తక్కువగా ఉండి దిగుబడి బాగా వస్తుంది.

– సి.భాస్కర్‌రెడ్డి, గంగాపురం నిమ్మనపల్లి, మదనపల్లె మండలం

వర్షాల వల్ల ఇబ్బంది ఉండదు



మల్చింగ్ షీట్‌పై ఏ పంట పండించినా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు పడినా, నీరు తక్కువగా ఉన్నా పంటలకు ఇబ్బంది ఇబ్బంది ఉండదు. పంట చిన్న వయసులో ఉన్నా అధిక వర్షం ప్రభావం వల్ల వేరుకు తెగుళ్లు రాకుండా కాపాడుకోవచ్చు.

– అనిల్ రెడ్డి, రాఘవరాజపురం, రైల్వేకోడూరు

మల్చింగ్ పద్ధతితో రైతుకు ప్రయోజనం



గత కొంత కాలంగా మల్చింగ్ షీట్ ద్వారా దోస, కర్బూజ, టమాటా వంటి పంటలు సాగు చేస్తే అధిక ప్రయోజనం పొందవచ్చు. ఈ పద్ధతి వల్ల రైతులకు అన్ని పంటలలో వేరు వ్యవస్థ బాగా ఉండి, తెగుళ్ల నివారణ, అధిక దిగుబడి, తక్కువ నీటి వాడకం, కలుపు నివారణ వల్ల రైతులకు ఇలా అనేక ప్రయోజనాలు ఉంటాయి.

– రవిచంద్రబాబు, జిల్లా ఉద్యానశాఖ అధికారి

వడ్డె ఓబన్న జీవితం స్ఫూర్తిదాయకం



రాయచోటి టౌన్ : స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డె ఓబన్న జీవితం స్ఫూర్తిదాయకమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. తొలితరం స్వాతంత్య్ర సమరయోధుడైన వడ్డె ఓబన్న అందించిన స్ఫూర్తిని అందరూ స్మరించుకోవాలన్నారు. ఆయన జీవితం చిరస్మరణీయం, ఆదర్శమన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ప్రధాన అనుచరుడిగా బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా చేసిన పోరాటంలో ఆయన పోషించిన పాత్ర చరిత్రలో నిలిచిపోయిందన్నారు. ఆయన విలువలు, సూచనలు పాటిస్తూ మెరుగైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బడుగు, బలహీన వర్గాలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

పట్టుబడిన బియ్యం లారీ

రాయచోటి : రాష్ట్రం దాటి వెళ్తున్న బియ్యం లారీని విజిలెన్స్ పోలీసులు గుర్రంకొండ మండల కేంద్రంలో స్వాధీనం చేసుకున్నారు. గురువారం అర్ధరాత్రి అనంతరం జమ్ములమడుగుకు చెందిన విజిలెన్స్ పోలీసులు పీడీఎఫ్ బియ్యం లారీ కర్ణాటక రాష్ట్రానికి వెళ్తున్నట్లు సమాచారం అందడంతో వెంటాడి పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన లారీని గుర్రంకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిలబెట్టి పోలీసులకు తాత్కాలిక సమాచారం ఇచ్చామన్నారు. ఇదే విషయంపై గుర్రంకొండ పోలీసులకు వివరణ కోరగా విజిలెన్స్ పోలీసులు పట్టుకొని ఇక్కడ నిలబెట్టి వెళ్లారని, తమకు పూర్తి సమాచారం తెలియదని చెబుతున్నారు. విజిలెన్స్ పోలీసులు పట్టుకున్న లారీలో పీడీఎఫ్ బియ్యమా లేక అన్ని అనుమతులతో వెళుతున్న బియ్యమా అన్నది తేల్చాల్సి ఉంది.

ఆ టీడీపీ సర్పంచ్.. గ్రామ మోటారును బొక్కేశాడు!

- 2020 డిసెంబర్‌లో జలజీవన్ కింద రూ.3 లక్షలు మంజూరు
- వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారనే.. గ్రామస్తులపై సర్పంచ్ కక్షసాధింపు
- ముక్కావారిపల్లెకు చెందిన ఓ రైతుకు రూ.62 వేలకు మోటారు విక్రయం



చాపల హరిజనవాడలో మోటారు లేక నిరుపయోగంగా ఉన్న బోరు

పుల్లంపేట : రైల్వేకోడూరు నియోజకవర్గం పుల్లంపేట మండలంలోని చాపల హరిజనవాడలో టీడీపీకి చెందిన స్థానిక గ్రామ పంచాయతీ సర్పంచ్ ఇటీవల బోరు మోటారు అమ్ముకోవడం పెద్దచర్చకు దారితీసింది. ఇది గ్రామస్తులందరికీ షాక్‌కు గురి చేసింది. ఎండాకాలం వచ్చినప్పుడు ప్రజలు తాగునీటి కోసం ఇక్కట్లు పడాల్సిందే. దీనిని దృష్టిలో పెట్టుకొని అధికారులు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని జలజీవన్ పథకం ద్వారా 2020 డిసెంబర్‌లో రూ.3 లక్షలతో బోరు, పంపు, పైపులు మంజూరు చేశారు. అనంతరం పనులు చేపట్టి బోరు తవ్వించి మోటారును అమర్చింది. ఆ బోరు వలన గ్రామానికి నీటి కష్టం లేకుండా పోయింది. కాగా 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీకి చెందిన సర్పంచ్ బోరులో ఉన్న మోటారును, పంపును, పైపులను ముక్కావారిపల్లెకు చెందిన ఓ రైతుకు రూ.62 వేలకు విక్రయించినట్లు గ్రామస్తుల వినికిడి. దీంతో హరిజనవాడ గ్రామస్తులకు నీటి కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. అయితే గ్రామస్తులలో కొందరు గ్రామానికి చెందిన మోటారును అమ్ముకోవడం ఏమిటని సర్పంచ్ తీరుపై మండిపడుతున్నారు. ప్రజాప్రతినిధి అయ్యి ఉండి గ్రామానికి మంచి చేయాల్సింది పోయి గ్రామస్తుల అవసరాలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మోటారు అమ్ముకోవడం ఏంటీ అంటూ ఎద్దేవా చేస్తున్నారు. సర్పంచ్ చేసిన ఈ నిర్వాకంతో తాము నీటి కష్టాలు పాలవుతున్నామని వాపోయారు. సమస్యను పరిష్కరించాల్సిన సర్పంచే తమను ఇబ్బందులకు గురి చేస్తే తాము ఎవరికి చెప్పుకోవాలంటూ ఆవేదన చెందుతున్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారనే ఒకే ఒక్క కారణంతో తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రముఖ నాయకుడి కనుసన్నల్లో స్థానిక సర్పంచ్ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్పంచ్ వల్ల ఎదురైన తాగునీటి ఇబ్బందులను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలానే ప్రభుత్వ మోటార్‌తోపాటు పైపులు, పంపులను విక్రయించిన సర్పంచ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలంటూ హరిజనవాడ వాసులు కోరుతున్నారు.

రేపు ఆకేపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

రాజంపేట టౌన్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆకేపాటి ఎస్టేట్‌లో మండల స్థాయిలో ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు జబ్బిరెడ్డి వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనే మహిళలు ముగ్గుపిండి, రంగులు వారే తెచ్చుకోవాలన్నారు. అలాగే ఒక్కరే ముగ్గు వేయాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా ఎలక్ట్రికల్ కుక్కర్, ద్వితీయ బహుమతిగా మిక్సీ, తృతీయ బహుమతిగా ప్రిస్టేజ్ కుక్కర్‌తోపాటు మరో ఇద్దరికి కన్సలేషన్ బహుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతి ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈనెల 14వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మహిళలకు తాడులాగుడు పోటీలు, పిల్లలకు మ్యూజికల్ ఛైర్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలియజేశారు. పోటీల్లో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి చేతులమీదుగా బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. వివరాలకు 85006 15294, 94925 32257 నంబర్లను సంప్రదించాలన్నారు.

దుస్తుల పంపిణీ

రాయచోటి టౌన్ : రాయచోటిలోని తిరుపతి నాయుడు కాలనీలో ఉన్న లక్ష్మీ వృద్ధాశ్రమంలో అర్చనా విద్యాసంస్థల డైరెక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమంలోని వృద్ధులకు రాయచోటి రోటరీ క్లబ్ బట్టలు అందజేశారు. శుక్రవారం ఆశ్రమంలోని వృద్ధులకు ముక్కోటి ఏకాదశి సందర్భంగా గీతా టెక్స్‌టైల్స్, రామకృష్ణ టెక్స్‌టైల్స్ సహకారంతో చీరెలు, పంచలు, టవళ్లు అందజేశారు. సంస్థ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ రఘునాథ, కేర్ టేకర్ సుజన తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవచూపండి



మాట్లాడుతున్న ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : ప్రజా సమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కరించాలని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో మండల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో మృతి చెందిన ఏఓ గురుప్రసాద్, అటెండర్ సునీతలకు సంతాపం తెలిపి మౌనం పాటించారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను సభా దృష్టికి తీసుకువచ్చారు. గుడ్లవారిపల్లిలో స్కూల్ బిల్డింగ్ భవనాన్ని కొంతమంది ఆక్రమించుకున్నారని, ఈ విషయంపై స్థానిక ఎంఈఓ చక్రేనాయక్‌కి తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆ గ్రామ సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 28, మార్చి 1, 2వ తేదీలలో జరగబోవు గంగమ్మ జాతరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని చొరవ చూపాలన్నారు. చెరువులు, చెక్ డ్యాములు కోతకు గురయ్యాయని, వాటికి మరమ్మతులు చేయాలని సభ్యులు కోరారు. మంత్రి ఆదేశించినా నేటికీ ఆర్టీసీ అధికారులు లక్కిరెడ్డిపల్లి, రామాపురం మీదుగా కడపకు సర్వీసును నడపకపోవడంతో సభ్యులు ఆర్టీసీ సిబ్బందిని నిలదీశారు. మండలంలో రీ సర్వేలో జరుగుతున్న తప్పులపై మరోసారి రీ సర్వే చేయించాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రెడ్డయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, ఎంపీటీసీ సభ్యులు దస్తగిరి, ఉదయగిరి ఎల్లమ్మ, రామసుబ్బారెడ్డి, లక్ష్మినారాయణ, మోటుపల్లి రాధ, సర్పంచ్‌లు వెంకటనారాయణ రెడ్డి, గడ్డం కల్యాణి ప్రభాకర్ రెడ్డి, రమణా రెడ్డి, వివిధ శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పథకాల అమలు తీరు మెరుగుపడాలి



మాట్లాడుతున్న లంకా దినకర్

రాజంపేట టౌన్ : జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల అమలు తీరు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్నమయ్యజిల్లా అత్యంత వెనుకబాటుతనంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, పోతుగుంట రమేష్‌నాయుడు, నాయకులు సురేష్‌రాజు, పి.కృష్ణయాదవ్, షబ్బీర్ అహమ్మద్, చెంగల్‌రాజు, డాక్టర్ రాంప్రసాద్, సునీత, మస్తానయ్య, నారాయణవర్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

దినకర్‌ను కలిసిన రాయచోటి నాయకులు

రాయచోటి టౌన్ : 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్‌ను రాయచోటి బీజేపీ నాయకులు శుక్రవారం కలిసి ఘనంగా సన్మానించారు. కలిసిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్, నాయకుడు డాక్టర్ పాలగిరి శ్రీనివాసకుమార్‌రాజు, నిర్మల్ కుమార్, మహేశ్వర్ రాజులు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

రాజంపేట : మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ కోరారు. రాష్ట్ర యూనియన్ పిలుపుమేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలన్నారు. ఉద్యోగ విరమణ వయస్సు 62కు పెంచాలన్నారు. కార్మికుల దహన సంస్కారాలకు రూ.20వేలు, ఇంజనీరింగ్ కార్మికులకు జీఓ నెంబరు 36 ప్రకారం జీతాలు చెల్లించడంతోపాటు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు జీపీఎస్ అకౌంట్లు, సరెండర్ లీవ్‌లను మంజూరు చేయాలన్నారు. మున్సిపల్ శాఖ మంత్రికి తమ గోడు వెల్లబోసుకున్న ఫలితం లేకుండా పోయిందన్నారు. న్యాయమైన డిమాండ్స్‌ను పరిష్కరించేంత వరకు పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో కార్మికులు పీవీ రమణ, జీ.రమణ, ఎ.బాలాజీ, ఎంవీ రమణ, కోదండమయ్య, బుజ్జమ్మ, కె.ప్రసాద్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

వైఎస్సార్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ ఆడుతున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

రామాపురం : సుద్దమల్ల గ్రామం వైఎస్సార్‌సీపీ యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి క్రికెట్ పోటీలను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి ప్రారంభించారు. యువతతో కలిసి ఆయన సరదగా క్రికెట్ ఆడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిన, గెలిచిన క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా క్రీడలు నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులకు తెలియజేశారు.

నివాళి

నందలూరు : పొత్తపికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు శేషారెడ్డి తల్లి మరణించారు. శుక్రవారం ఎమ్మెల్యే ఆకేపాటి ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఉత్తర ద్వార దర్శనం.. సర్వపాప హరణం

వైకుంఠ ఏకాదశికి ఎంతో విశిష్టత ఉంది. ఈ రోజున ముక్కోటి దేవతలు శ్రీ మహావిష్ణువును సేవించేందుకు ఉత్తర ద్వారం వద్ద వేచి ఉంటారని పురాణాలు చెబుతున్నాయి. అందువల్ల భక్తులు ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకుంటారు. ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. ఈ కారణంగా శుక్రవారం ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని వేకువ జాము నుంచే భక్తులు పెద్దఎత్తున వైష్ణవ ఆలయాలకు తరలి వచ్చి స్వామివారిని ఉత్తర ద్వారం గుండా దర్శించుకొని తరించారు. దీంతో వైష్ణవ ఆలయాల్లో భక్తుల సందడి కనిపించింది. పలు ఆలయాల్లో కల్యాణోత్సవాలు, భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేశారు. – సాక్షి, నెట్‌వర్క్



రైల్వేకోడూరు అర్బన్: దర్శనానికి బారులుతీరిన భక్తులు



రాజంపేట టౌన్: వెంకట రాజంపేటలో..



ఓబులవారిపల్లె: అప్పలాయకుంటలో..




నందలూరు: సౌమ్యనాథ స్వామి ఆలయం వద్ద..



సంబేపల్లె : స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



చిన్నమండెం : శ్రీనివాసుడి కల్యాణంలో పాల్గొన్న భక్తులు



చిట్వేలి: కెఎస్ అగ్రహారంలో గరుడ వాహనంపై వేంకటేశుడు



సిద్దవటం: పార్వతీపురంలో సీతా రామలక్ష్మణుల గ్రామోత్సవం



చిన్నమండెం: ఉత్తర ద్వార దర్శనం కోసం క్యూ లైన్‌లో భక్తులు



వీరబల్లి: దర్శనమిస్తున్న లక్ష్మీనరసింహ స్వామి



రైల్వేకోడూరు అర్బన్: అలంకారంలో వేంకటేశ్వరుడు



గాలివీడు: స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు



పెనగలూరు: అలంకారంలో వేణుగోపాల స్వామి